


నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

18 బుధవారం నవంబర్ 2026 పేజీలు: 3

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి గ్రామ సమస్యలపై వినతిరోడ్డు నిర్మాణం, బస్సు సౌకర్యం కల్పించాలని కోరిక



కనగల్, 18 నవంబర్ – సత్యనిష్ఠ : తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగం లక్ష్మి నారాయణ, మల్లయ్య, వెంకటేశం, ప్రేమయ్య, గంటె టెకంపు లింగయ్య, చిత్రం నాగేష్, మండలి లింగయ్య, సింగం రవి, వంపు కిరణ్, జెట్టి రామలింగం, వంపు విజయ్, పగిల్లా వంశీ, కదిరే జానీ మర్యాదపూర్వకంగా కలిసి కనగల్ మండలం, బోయినపల్లి గ్రామ సమస్యలపై మాట్లాడడం జరిగింది. సింగం లక్ష్మి నారాయణ మాట్లాడుతూ డోరెపల్లి నుండి లక్ష్మి దేవి గూడెం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టి, నల్గొండ నుండి చెన్నారం వయా దోరెపల్లి, బుధుమరలపల్లి, కనగల్, చందూరు బస్సు సౌకర్యం కల్పించి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని కోరినారు.

నల్గొండ జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ సెలక్షన్ ట్రయల్స్ విజయవంతం

- **80 మంది క్రీడాకారులు హాజరు**
- **రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక**





నల్గొండ, 17 నవంబర్ – సత్యనిష్ఠ : నల్గొండ జిల్లా స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు (సెలక్షన్ ట్రయల్స్) మంగళవారం స్థానిక శివాజీ నగర్‌లోని ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ లెర్నింగ్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సెలక్షన్ ట్రయల్స్‌కు జిల్లా వ్యాప్తంగా సుమారు 80 మంది షూటింగ్ బాల్ క్రీడాకారులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21, 22 తేదీలలో చర్లపల్లిలోని సెయింట్ మేరీ స్కూల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో నల్గొండ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్గొండ జిల్లా క్రీడా అధికారి (డిఎస్ఓ) ఎండి అక్బర్ అలీ, ఎస్ఎస్ స్కూల్ కరస్పాండెంట్ సత్య శ్రీ, ఎస్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, షూటింగ్ బాల్ నల్గొండ జిల్లా అధ్యక్షులు షేక్ రహీం మరియు ఎండి అక్బర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ లెర్నింగ్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల బృందం, సీనియర్ క్రీడాకారులు పవిత్ర, యూసుఫ్, జాంగీర్ బాబా తదితరులు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సూర్యాపేటలో కమిటీ

వ్యవస్థాపక అధ్యక్షుడు చీమ శ్రీనివాస్



సూర్యాపేట (సత్యనిష్ఠ స్టేట్ బ్యూరో గౌస్): సూర్యాపేట నియోజకవర్గ నూతన కమిటీ నియామకం అధ్యక్షులుగా కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎద్దు. యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా బోయినపల్లి. సత్యనారాయణ, కార్యదర్శిగా నారబోయిన సత్యనారాయణ, గౌరవ సలహాదారులుగా కటారి కృష్ణయ్య లను నియమించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్ నియామక పత్రాలను అందించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆవుల. రామారావు సూర్యాపేట పట్టణంలోని స్థానిక నెహ్రూ నగర్ నందు సూర్యాపేట నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నూతన కమిటీని నియమించడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్ ఆధ్వంలో జరిగిన ఈ కార్యక్రమంలోతెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల రామారావు హాజరై నూతనంగా ఎన్నికైన ఉద్యమకారులకు నియామక పత్రాలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల రామారావులు మాట్లాడుతూ నూతనంగా నియమించబడిన ఉద్యమకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారులు చేసిన ఉద్యమాలు మరువలేనివి అని ఉద్యమకారుల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని త్వరలో తెలంగాణ ఉద్యమకారులకు మంచి రోజులు రాబోతున్నాయని, ఉద్యమకారులు ఎవరు అధైర్య పడవద్దని తెలిపారు.అనంతరం సూర్యపేట జిల్లా అధ్యక్షులు గుండెపంగు.రమేష్ మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న మండలాల్లో ఉద్యమకారుల సమావేశాలు నిర్వహించి నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయబోతున్న వెబ్సైట్లో తెలంగాణ ఉద్యమకారుల పేర్లను నమోదు చేయించే విధంగా కమిటీ పని చేయాలని నూతనంగా నియమించబడ్డ కమిటీకి సూచనలు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకాల ఫోరం కోదాడ నియోజకవర్గ నాయకులు ఏనుగుల.యల్లేశ్వరరావు ముసగాల మండల అధ్యక్షులు పోలంపల్లి. వెంకటేశ్వర్లు గౌడ్, మహమ్మద్ అబ్దుల్ అజీజ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు



- **వివోపలపై అధికారుల వేధింపులు అరికట్టాలి**
- **వివోపలకు ఉద్యోగ భద్రత కల్పించాలి**

తిప్పర్తి, 18 నవంబర్ – సత్యనిష్ఠ : వివోపలపై అధికారుల వేధింపులు అరికట్టాలని, వివోపలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తొలగించిన వివోపని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తిప్పర్తి మండలం మామిడాల గ్రామంలో వివోపగా పనిచేస్తున్న అన్నపూర్ణను అకారణంగా తొలగించడంతో మండల కేంద్రంలోని సమైక్య ఆఫీస్ ముందు తిప్పర్తి మండల వివోపలందరూ సమ్మెకు దిగారు. సమ్మె సందర్భంగా లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ ఎటువంటి ఆరోపణలు లేకుండా రాజకీయ ఒత్తిడితో అన్నపూర్ణను విధుల నుంచి తొలగించారని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల మండలంలోని వివోపలందరూ సమ్మెలో ఉంటారని తెలియజేశారు. ఉద్యోగ భద్రత లేకుండా, కనీస వేతనం లేకున్నా అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులను కొందరు కావాలని ఇబ్బంది పెడుతున్నారని, ఇటువంటి చర్యలు మానుకోవాలని అన్నారు. వెంటనే అన్నపూర్ణను విధుల్లోకి తీసుకునేంతవరకు సమ్మె కొనసాగుతుందని, ఈ ఉద్యమానికి సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన జరుగుతుందని అన్నారు. వివోపలపై జిల్లా పీడీ, ఏపీఎం కావాలని కార్మికులపై ఒత్తిడి చేస్తున్నారని, జిల్లా పీడీ, ఏపీఎం తమ వైఖరి మార్చుకొని కార్మికుల పక్షాన ఉండాలని, వివోపని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ భీమగాని గణేష్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పోకల శశిధర్, ఐకెపి వివోపి ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంత్రాల మంగమ్మ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండి రుమాన, జక్కుల అనిత, మండల వివోపలు అన్నపూర్ణ, యాదమ్మ, మౌనిక, నాగమ్మ, సంధ్య, రమణ, జయమ్మ, లక్ష్మి, పుష్ప, కాశింబి, మల్లయ్య, పరుషరాములు, జానకమ్మ, స్రవంతి, సువర్ణ, రాణి, వసుమతి, వసంత తదితరులు పాల్గొన్నారు.

పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగకు వినతి పత్రం

నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలి:బాధితుల డిమాండ్



మిర్యాలగూడ, 17నవంబర్ – సత్యనిష్ఠ: దీపావళి పండగ రోజున జరిగిన సంఘటన గురించి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు, విహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగను కలిసి ఈ విషయం గురించి తెలిపి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మునుగోడు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా షోయబుల్లాఖాన్ జయంతి వేడుకలు

- నిజాయితీ జర్నలిజానికి ప్రతీక షోయబుల్లాఖాన్
- మునుగోడు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సామాజిక, పర్యావరణ ఉద్యమ నాయకులు జీడిమెట్ల రవీందర్



మునుగోడు, 18 నవంబర్ - సత్యనిష్ఠ: ప్రముఖ పాత్రికేయుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు షోయబుల్లాఖాన్ జయంతి వేడుకలను మునుగోడు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సామాజిక, పర్యావరణ ఉద్యమ నాయకులు జీడిమెట్ల రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ తోట నరసింహాచారి షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాస్వామ్య విలువలు, పత్రికా స్వేచ్ఛ, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. షోయబుల్లాఖాన్ తన రచనల ద్వారా నిజాం నిరంకుశ పాలనను, రజాకార్ల దౌర్జన్యాలను ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం, జాతీయ సమైక్యత, పత్రికా స్వేచ్ఛ కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. 'ఇమ్రోజ్' ఉర్దూ పత్రిక సంపాదకుడిగా నిర్భయంగా ప్రజల గొంతుకగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మిర్యాల వెంకటేశ్వర్లు, జర్నలిస్టు నాయకులు గుర్రాల పరమేష్, కోణం రమేష్ నేత, బేరి రవీందర్, బీఎస్పీ సీనియర్ నాయకులు గుర్రాల నాగయ్య, టిఆర్ఎస్ నాయకులు ఎడవెల్లి సురేష్ గుప్తా, బొల్లు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

తాళ్ళపాక తిరపయ్య మృతికి నివాళ్ళు

కోదాడ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిరి నాగిరెడ్డి



కోదాడ - నవంబర్ 17 (సత్యనిష్ఠ) కోదాడ నియోజక వర్గం పరిధి లోని అనారోగ్యం తో మృతి చెందిన ముకుందా పురం గ్రామ వాసి తాళ్ళపాక తిరపయ్య మృతి బాధాకరం అని కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి అన్నారు. మంగళ వారం నాడు ముకుందాపురం లో తిరపయ్య పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించరూ ఈ యొక్క కార్యక్రమంలో ముకుందాపురం గ్రామ సీనియర్ నాయకులు, కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి, ముకుందాపురం గ్రామ సర్పంచ్ కోళ్లపూరి రాములమ్మ, మాజీ ఎంపీటిసి బోళ్ళ వెంకటరెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు నూకమళ్ల రామక్రిష్ణ, యం యస్ విద్యా సంస్థల సీ ఈ వో యస్ యస్ రావు, పలువురు గ్రామస్తులు బంధువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఫౌండేషన్ చైర్మన్ పదవి నాగిరెడ్డి, గౌరవ సలహాదారులు సేకు శ్రీనివాసరావు 5000 ఆర్థిక సాయం అందజేశారు.

అర్వపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

- **జిల్లా ఎస్పీ నరసింహ**

అర్వపల్లి (సత్యనిష్ఠ స్టేట్ బ్యూరో గౌస్) అర్వపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ నరసింహ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, సిబ్బంది విధులు, పెట్రోలింగ్ నిర్వహణ, కేసుల పురోగతి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, కేసుల నమోదు విషయంలో ఎలాంటి జాప్యం చేయరాదని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రాథమిక విచారణను వేగవంతంగా పూర్తి చేయాలని,



ప్రజలకు భరోసా కల్పిస్తూ వారి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండల పరిధిలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. అలాగే పాత నేరస్థులు, నేరాలకు అలవాటు పడిన వ్యక్తులు, షీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. గ్లోబల్ జియోట్యాగింగ్ విధానం ద్వారా వారిని పర్యవేక్షిస్తూ, ప్రతి ఒక్కరినీ మ్యాపింగ్ చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ తనిఖీలో నాగారం సీఐ నాగేశ్వరరావు, అర్వపల్లి ఎస్ఐ మధు సిబ్బంది ఉన్నారు.

మూసీ నది గర్భంలో ఇసుక తవ్వకాలకు అనుమతివ్వొద్దు!

- **చిత్తలూరు, వంగమర్తి ఇసుక మైనింగ్ ప్రతిపాదనను రద్దు చేయాలి**
- **సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్**

శాలిగౌరారం, 17 నవంబర్ - సత్యనిష్ఠ : మూసీ నది పరివాహక ప్రాంతంలోని చిత్తలూరు, వంగమర్తి గ్రామాల పరిధిలో భారీ స్థాయిలో ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేసిన ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్.ఐ)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నోటీసు ప్రకారం చిత్తలూరు, వంగమర్తి ఇసుక రీచ్‌ల నుంచి సంవత్సరానికి 2,70,980 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వేందుకు ప్రతిపాదించడం దారుణమని పేర్కొన్నారు. రూ.4.10 కోట్ల



అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుపై నవంబర్ 18న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజల అభ్యంతరాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు. మూసీ నది గర్భంలో భారీ స్థాయిలో ఇసుక తవ్వకాలు చేపడితే భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు వ్యవసాయానికి, పర్యావరణ సమతుల్యతకు, నది సహజ ప్రవాహానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న రైతుల జీవనాధారాలను దెబ్బతీసే ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం ఎందుకు ముందుకు తెస్తోందని ప్రశ్నించారు. ప్రజల సహజ వనరులను కాపాడాల్సిన ప్రభుత్వ సంస్థలే వాటిని విధ్వంసం చేసే ప్రతిపాదనలు తీసుకురావడం సరైంది కాదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను కేవలం మొక్కుబడిగా నిర్వహించి ఇసుక తవ్వకాలకు అనుమతులు మంజూరు చేస్తే ప్రజా ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చిత్తలూరు, వంగమర్తి ఇసుక రీచ్‌ల ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయాలని, సంబంధిత జీవోను ఉపసంహరించుకోవాలని, పర్యావరణ ప్రభావ అంచనా నివేదికతో పాటు ప్రభుత్వ రికార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర నిపుణుల ద్వారా భూగర్భ జలాలు, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కోరారు. మూసీ నదిని, రైతుల జీవనాధారాలను కాపాడేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 18న అధికారులు నిర్వహించే అభిప్రాయ సేకరణలో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గజ్జి రవి, వేముల శంకర్, డివిజన్ నాయకులు సిలువేరు జానయ్య, కుంభం వెంకటేశ్వర్లు, గుగ్గిళ్ల రాములు, బోడ శంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రత్నవరం, కరివిరాల గ్రామాలలో చేయూత పింఛన్ల కార్యక్రమాల నిర్వహణ

కోదాడ - నవంబర్ 17 (సత్యనిష్ఠ) కోదాడ నియోజక వర్గ పరిధిలో ఈరోజు నడిగూడెం మండలంలోని కరివిరాల, రత్నవరం గ్రామాలలో కోదాడ ఎమ్మెల్యే (అమ్మ) పద్మావతి ఆదేశం మేరకు మండల పార్టీ ఆధ్వర్యంలో రెండు గ్రామాలలో చేయూత పింఛనుల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు దాట్ల నాగేశ్వరరావు, మారోజు పార్వతమ్మ, అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేపూరి తిరుపతమ్మ, నడిగూడెం మండల



పార్టీ అధ్యక్షులు మొక్క బిక్షపతి, మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటేశ్వర్లు, నడిగూడెం మండల కేంద్రం సర్పంచ్ దున్న శ్రీనివాస్, కేశవాపురం సర్పంచ్ రాజేష్, వేణు గోపాలపురం సర్పంచ్ సోమయ్య, మరియు మండల నాయకులు గుండు శ్రీనివాస్, బాణాల నాగరాజు, కాసాని శివ, గుండు రామారావు, పల్లపు శ్రీనివాస్, వేపూరి సుధీర్, కరివిరాల గ్రామ మాజీ సర్పంచ్లు నీలిమా గాంధీ, పాతకోట్ల నాగేశ్వరావు, రత్నవరం మాజీ సర్పంచ్లు వినయ్ వర్ధన్, పగడాల పద్మ, నడిగూడెం సింగల్ విండో మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, వివిధ హోదాలలో ఉన్న ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, పార్టీ అభిమానులు, ప్రజలు కార్యకర్తలు పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- **మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలి**
- **వాణిజ్య ఒప్పందాలు దేశీయ రైతాంగానికి నష్టం: ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి విజ్జు కృష్ణన్**

నల్గొండ, 18 నవంబర్-సత్యనిష్ఠ: రైతాంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాలను ఉధృతం చేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కార్యదర్శి విజ్జు కృష్ణన్ పిలుపునిచ్చారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అమెరికా, ఐరోపా సమాఖ్య, న్యూజిలాండ్, బ్రిటన్ తదితర దేశాలతో కేంద్ర ప్రభుత్వం చేసుకుంటున్న వాణిజ్య ఒప్పందాలు భారత రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. నల్గొండలో జరుగుతున్న ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలు రెండో రోజు మంగళవారం సారంపల్లి మల్లారెడ్డి నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులుగా జరుగుతున్న మహాసభలకు తెలంగాణ నలుమూలల నుంచి రైతులు పెద్దఎత్తున తరలివచ్చారని, బహిరంగ సభను విజయవంతం చేసిన రైతాంగానికి, ప్రజా సంఘాలకు, యువతకు, ప్రసార మాధ్యమాల ప్రతినిధులకు ఆహ్వాన సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ప్రతినిధులు మహాసభలకు హాజరయ్యారని తెలిపారు. అధ్యక్ష వర్గం, తీర్మానాల కమిటీ, ప్రతినిధుల అర్హతల పరిశీలన కమిటీ, మార్గదర్శక కమిటీ, కార్యవివరాల నమోదు కమిటీల ఆధ్వర్యంలో సభా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. గత మూడేళ్లలో దేశవ్యాప్తంగా రైతు సంఘం నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదురైన సమస్యలపై జాతీయ ప్రధాన కార్యదర్శి నివేదిక సమర్పించారని చెప్పారు. రైతాంగం, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే పది తీర్మానాలు ప్రవేశపెట్టినట్టు వెల్లడించారు. ఈ నెల 15న నిర్వహించిన భారీ ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతమయ్యాయని, లక్ష్యానికి అనుగుణంగా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. 16న సారంపల్లి మల్లారెడ్డి నగర్‌లో జెండా ఆవిష్కరణతో ప్రతినిధుల మహాసభ ప్రారంభమైందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు రాకేష్ తికాయత్, రావుల వెంకయ్య, శంకర్ ఘోష్, పురుషోత్తం శర్మ సభకు హాజరై రైతాంగ ఐక్య ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారని వివరించారు. కార్మికులు, రైతులు,



వ్యవసాయ కార్మికుల ఐక్యతతోనే పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమన్నారు. డిసెంబర్ 1 నుంచి 3 వరకు ఢిల్లీలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ కార్మిక పోరాటంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు కూడా పాల్గొని మద్దతు తెలపాలని నిర్ణయించినట్టు చెప్పారు. కనీస మద్దతు ధర, ఉపాధి హామీ, ఆహార భద్రత, కార్మిక హక్కుల పరిరక్షణ ప్రధాన డిమాండ్లుగా ఉంటాయన్నారు. నవంబర్ 26న దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు ఐక్యంగా పోరాటాలు నిర్వహించనున్నారని తెలిపారు. నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయడంతోపాటు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని డిమాండ్ చేస్తామన్నారు. ఓటు హక్కును హరిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం కూడా ఉద్యమిస్తామని వెల్లడించారు. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతులు, కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతూ, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలపై ప్రభుత్వ నియంత్రణను తగ్గిస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తి వ్యయం పెరుగుతూ రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. గుజరాత్‌లో రైతులు అప్పట్లోనే ఇది అభివృద్ధి నమూనా కాదని, మోదీ, అదానీ, అంబానీల ప్రయోజనాలకు అనుగుణంగా సాగుతున్న పాలనా విధానమని విమర్శించారని గుర్తుచేశారు. నేటి పరిస్థితులు ఆ విమర్శలను నిజం చేస్తున్నాయని అన్నారు. అమెరికా, ఐరోపా సమాఖ్య, న్యూజిలాండ్ వంటి దేశాల రైతులకు అక్కడి ప్రభుత్వాలు భారీగా ఆర్థిక సహాయం అందిస్తున్నాయని, అక్కడ ఒక రైతుకు సుమారు రూ.22 లక్షల వరకు రాయితీలు లభిస్తుండగా, భారతదేశంలో రైతుల సగటు భూమి విస్తీర్ణం ఐదు ఎకరాల లోపే ఉంటుందని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరలకు దిగుమతి చేసుకుంటే దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి, సోయాబీన్, పండ్లు, బాదం వంటి ఉత్పత్తులు విదేశాల నుంచి తక్కువ ధరలకు వస్తే ఇప్పటికే గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న భారత రైతుల పరిస్థితి మరింత దిగజారుతుందని పేర్కొన్నారు. 2014 నుంచి 2026 వరకు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం దేశంలో సుమారు ఐదు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, వలస కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, తెలంగాణలో 32 జిల్లాల్లోని 365 మండలాల్లో కరువు ప్రకటించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు తగిన సహాయం అందడం లేదని విమర్శించారు. గత మూడేళ్లలో వివిధ రాష్ట్రాల్లో రైతు సంఘం నిర్వహించిన పోరాటాలతో అనేక విజయాలు సాధించామని విజ్జు కృష్ణన్ వివరించారు. మహారాష్ట్రలో రైతుల దీర్ఘకాల పాదయాత్రలు, ఆందోళనల ఫలితంగా రూ.32 వేల కోట్ల రుణమాఫీ సాధించామని తెలిపారు. తమిళనాడులోనూ సుమారు రూ.9 వేల కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. రాజస్థాన్‌లో పంటల బీమా పరిహారం కోసం రైతులు చేసిన పోరాటంతో చూరు జిల్లాలో 2017 నుంచి 2023 మధ్య రూ.4 వేల కోట్లకు పైగా పరిహారం సాధించారని వివరించారు. కర్ణాటకలో బెంగళూరు విమానాశ్రయం సమీపంలోని చెన్నరాయపట్నంలో పరిశ్రమల ఏర్పాటు పేరుతో రైతుల నుంచి సేకరించిన సుమారు 1,200 ఎకరాల భూమిని మూడేళ్ల పోరాటం అనంతరం తిరిగి రైతులకు అప్పగించారని తెలిపారు. దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అఖిల భారత కిసాన్ సభ క్రియాశీలంగా పనిచేస్తోందన్నారు. 2022 మహాసభల అనంతరం ఇప్పటివరకు 21 లక్షల మంది కొత్త సభ్యులు చేరడంతో సంఘం సభ్యత్వం కోటి 58 లక్షలకు చేరిందని తెలిపారు. తెలంగాణలోనూ రెండు లక్షల మందికి పైగా కొత్త సభ్యులు చేరారని చెప్పారు. దేశవ్యాప్తంగా రైతుల హక్కుల కోసం సాగించిన పోరాటాల్లో చారిత్రాత్మకమైన విజయం సాధించామని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రైతుల ఉద్యమం ద్వారానే వెనక్కి తీసుకునేలా చేశామని గుర్తుచేశారు. ఆ పోరాటంలో 736 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక విధానాలను మరో రూపంలో తిరిగి అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ఐక్యంగా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్, నల్గొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పి. వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలి

- **ఏఐటీయూసీ డిమాండ్**
- **కనీస వేతనం 26,000 ఇవ్వాలి**

నల్గొండ, 18 నవంబర్ - సత్యనిష్ఠ: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పల్లా దేవేందర్ రెడ్డి కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్గొండ మిషన్ భగీరథ ఎస్ఈ నాగేశ్వరరావుకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ఒప్పందం ప్రకారం 2026 జూలై నాటికి అగ్రిమెంట్ అయిపోయిందని, జులై నుంచి కొత్త వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ నేటి వరకు కాంట్రాక్టర్ల వైపు నుంచి ఎలాంటి స్పందన లేదని అన్నారు. కావున తక్షణమే కాంట్రాక్టర్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి వేతనాలు పెంచాలని ఎస్ఈని కోరడం జరిగింది. మార్కెట్లో రోజురోజుకు నిత్యవసర సరుకుల ధరలు పెరుగుతున్నా కార్మికుల వేతనాలు పెరగకపోవడం విచారకరమని అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ తాగునీరు అందిస్తున్న మిషన్ భగీరథ కార్మికుల జీవితాల్లో మాత్రం కారుమబ్బులు అలుముకున్నాయని అన్నారు. ప్రతి



నెల వేతనాలు రాక చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి వ్యవస్థ పర్మనెంట్‌గా ఉండాలి కావున మిషన్ భగీరథ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మిషన్ భగీరథలో పనిచేసే కార్మికులకు ఒక్కొక్క జిల్లాల్లో ఒక రకమైన వేతనాలు ఇస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన వేతనాలు, పని విధానం ఉండాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని కోరారు. లైన్‌మెన్‌లు కిలోమీటర్ల దూరం సొంత వాహనాల్లో సొంత పెట్రోలు పోసుకొని ప్రయాణం చేసి అప్పుల పాలవుతున్నారని లైన్‌మెన్‌లకు పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. మిషన్ భగీరథలో ఏ జీవో ప్రకారం వేతనాలు ఇస్తున్నారో ఎవరికి అర్థం కాని పరిస్థితి ఉందని అన్నారు. తక్షణమే కార్మికుల వేతనాలను పెంచకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. మూడు నాలుగు నెలలకు ఒకసారి వేతనాలు రావడం వల్ల కార్మికులు అప్పులపాలవుతున్నారని కుటుంబం గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఏజెన్సీలకు బకాయిలు విడుదల చేసి కార్మికులకు వేతనాలు అందే విధంగా చూడాలని కోరారు. మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు పెంచటం కోసం కాంట్రాక్టర్లతో వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎస్ రెడ్డి, మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి జానీ, కోశాధికారి టి సత్యనారాయణ, మేడి రామకృష్ణ, ఏం సత్తయ్య, వై వెంకట్ రెడ్డి, సింగం మహేష్, ఎండి అలీముద్దీన్, శంకర్, మంగ యాదమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమాలు

- **డిసెంబర్, జనవరిలో గోదాముల ముట్టడికి పిలుపు**
- **ఉపాధి హామీ అమలులో ప్రభుత్వాలు విఫలం..**
- **నిత్యావసర ధరల పెరుగుదలపై ఆగ్రహం**



నల్గొండ, 18 నవంబర్ – సత్యనిష్ఠ : దేశంలో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేయనున్నట్లు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రకటించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఉపాధి హామీ పథకం అమలు తీరు, భూ పంపిణీ, ప్రజా పంపిణీ వ్యవస్థలో కోతలు, కార్మికుల హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ డిసెంబర్, జనవరి నెలల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 11వ జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత అధ్యక్షుడు, మాజీ ఎంపీ విజయరాఘవన్ మాట్లాడుతూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆహార ధాన్యాల ధరలు రెండంకెల స్థాయిలో పెరగడం సామాన్యుల జీవనాన్ని భారంగా మార్చిందన్నారు. కేరళలో సైతం బియ్యం ధరలు పెరగడంతో పేద కుటుంబాలపై అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు.గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాల్సిన ఉపాధి హామీ పథకం లక్ష్యాలను చేరుకోవడం లేదని విమర్శించారు. పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచుతామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. గ్రామీణ కూలీలకు పని, వేతనం, ఉపాధి భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు, సామాన్యులపై పన్నుల భారం పెంచే విధానాలను విమర్శించారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో పేద కుటుంబాలకు అందించే బియ్యం పరిమాణాన్ని 35 కిలోల నుంచి 25 కిలోలకు తగ్గించడం ఆందోళనకరమన్నారు. గిడ్డంగుల వ్యవస్థను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునే విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కరువు పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దేశంలో గ్రామీణ జనాభాలో సగం మందికి భూమి లేదని, వారికి సాగుభూమి, ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. దళితులు, గిరిజనుల భూములు వివిధ ప్రాజెక్టులు, గనుల తవ్వకాల పేరుతో ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. గోదాముల వద్ద ఆందోళనలు చేపడతాంసంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ మాట్లాడుతూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 11వ జాతీయ మహాసభలు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఫిబ్రవరి 14 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించాలని మహాసభలో చర్చించినట్లు చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి ప్రస్తుతం అందిస్తున్న ఐదు కిలోల బియ్యానికి అదనంగా మరో ఐదు కిలోలు ఇవ్వాలని, 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం డిసెంబర్, జనవరి నెలల్లో దేశవ్యాప్తంగా గోదాముల వద్ద ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.దేశంలో 36 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి ప్రభుత్వాల విధానాలే కారణమని విమర్శించారు. వ్యాపారులు, దళారుల నియంత్రణలో ధరలు పెరుగుతున్నాయని ఆరోపించారు. దేశంలో 40 కోట్ల ఎకరాల సాగుభూమి ఉన్నప్పటికీ భూమిలేని పేదలకు భూ పంపిణీ జరగడం లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, సాగుభూమి ఇవ్వాల్సిన ప్రభుత్వాలు భూ బ్యాంకుల పేరుతో కార్పొరేట్ సంస్థలకు భూములు కేటాయిస్తున్నాయని విమర్శించారు. భూ పంపిణీ ద్వారా గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తిని పెంచవచ్చని పేర్కొన్నారు.ఎస్ఐఆర్‌తో గ్రామీణ పేదలకు నష్టంప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వల్ల ప్రధానంగా వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు నష్టపోతున్నారని బి. వెంకట్ అన్నారు. దళితులు, ముస్లింలు, ఆదివాసీలు, వలస కార్మికుల ఓట్లు తొలగింపునకు గురవుతున్నాయని ఆరోపించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రజా వేదిక ఏర్పాటైందని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు విస్తృత స్థాయిలో ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎంపీ, అఖిల భారత సహాయ కార్యదర్శి శివదాసన్, అఖిల భారత సహాయ కార్యదర్శులు విక్రమ్‌సింగ్, వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బోప్పని పద్మ, కేంద్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఎంఈఎస్ఏ నల్గొండ కార్యవర్గం నూతన వన్ టౌన్ సీఐని కలిసింది

- **క్రాంతి కుమార్‌ను సన్మానించి స్వాగతం పలికారు**
- **వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వక భేటీ**



నల్గొండ, 18 నవంబర్ – సత్యనిష్ఠ : టీఎస్ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (టీఎస్ఎంఈఎస్ఏ) నల్గొండ కార్యవర్గ సభ్యులు గౌరవ అధ్యక్షులు ఏ.ఏ. ఖాన్, అధ్యక్షులు మహ్మద్ మొయిజ్, ప్రధాన కార్యదర్శి ఇంజనీర్ మహ్మద్ మహమూద్ మరియు మహ్మద్ షరీఫుద్దీన్, నేషనల్ కూలర్స్ మరియు ఎం.ఏ. జలీల్, ప్రీమియర్ కూలర్స్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్, నల్గొండలో ఎస్‌హెచ్‌ఓ / సీఐగా బాధ్యతలు చేపట్టిన క్రాంతి కుమార్‌ను కలిసి సన్మానించి స్వాగతం పలికారు.

ఆదివాసి హక్కులను కాలరాస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం

- **ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, మాజీ మంత్రి, త్రిపుర ప్రతిపక్ష నాయకుడు జితేంద్ర చౌదరి**

నల్గొండ, 18 నవంబర్ – సత్యనిష్ఠ : నల్లగొండ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులన్నిటినీ కాలరాస్తోందని ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, మాజీ మంత్రి, త్రిపుర ప్రతిపక్ష నాయకుడు జితేంద్ర చౌదరి తీవ్రంగా ఆరోపించారు. నల్లగొండ జీ యం కన్వెన్షన్ లో జరుగుతున్న అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభల్లో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా మహాసభ ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఆదివాసి గిరిజనులకు కల్పించిన 1/70 చట్టం,పేసా చట్టాలను పూర్తిగా కాలరాస్తూ వేలాది ఎకరాల అటవీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అటవీ సంరక్షణ నియమాల చట్టం 2023 పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. తరతరాలుగా అడవులను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసి గిరిజనులను ప్రాజెక్టులు ,అభివృద్ధి పేరుతో కోట్లాదిమందిని నిర్వాసితులుగా మార్చి బలవంతంగా వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ వాటి అనుబంధ సంస్థలు గిరిజనుల సంస్కృతి, ఆచారాలు, ఆహార అలవాట్లపై తీవ్రమైన దాడి చేస్తూ ఆదివాసి గుర్తింపు తొలగించేందుకు తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టిందన్నారు. వామపక్ష పార్టీలు, ఆదివాసీ గిరిజన, ప్రజా సంఘాలు పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 ద్వారా దేశంలో ఆదివాసి గిరిజనులకు అటవీ భూములపై హక్కులు కల్పించాల్సి ఉండగా వారి భూములను బలవంతంగా లాక్కుంటున్నారని అన్నారు. వచ్చే నేల డిసెంబర్ 9,10 తేదీల్లో ఢిల్లీలో జరగబోయే ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సమావేశాల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు గడుస్తున్న గిరిజనులకు ఇచ్చిన హామీల్లో ఒక్క హామీలు కూడా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో గిరిజనుల సాగులో ఉన్న ఏడు లక్షల ఎకరాల పోడు భూములకు హక్కులు ఇస్తామని హామీ ఇచ్చి ఒక్క ఎకరాకుపై కూడా హక్కులు కల్పించలేదని మండిపడ్డారు. గిరిజనులకు ఇచ్చిన హామీలపై కలిసి వచ్చే గిరిజన సంఘాలతో ఐక్య ఉద్యమాలను చేపడతామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకులు తమిళనాడు మాజీ ఎమ్మెల్యే ఢిల్లీ బాబు, రాజస్థాన్ నుండి ధూలి చంద్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్, మధ్యప్రదేశ్ లోల్తా ప్రసాద్, ఝార్ఖండ్ నుండి ప్రఫుల్ లింగ్డా,మధ్యప్రదేశ్ నుండి రామ్ నారాయణ కురారియా, తమిళనాడు నుండి ఏ వి షణ్ముగం, సర్వరణ, పొన్ను స్వామి, కేంద్ర కమిటీ సభ్యులు భూక్య వీరభద్రం, నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎర్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.